క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామి, అమ్మవార్లకు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏలేశ్వరానికి చెందిన విశ్వ హిందూ పరిషత్, మాతృశక్తి దుర్గా వాహిని మహిళా సంఘాల సభ్యులు ఆలయంలో సహస్రనామ పారాయణ చేశారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామిరామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పల్స్‌పోలియోను నూరుశాతం పూర్తి చేయాలి



గోకవరం ఇటుక బట్టీలో పల్స్ పోలియోను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి నిర్మలాగ్లోరి

గోకవరం: మండలంలో పల్స్‌పోలియోను నూరుశాతం పూర్తి చేయాలని నోడల్ అధికారి డాక్టర్ నిర్మలాగ్లోరి సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ మార్కింగ్ చేసే విధానం పరిశీలించి ఎంత మందికి చుక్కలు వేశారని అడిగి తెలుసుకున్నారు. మొబైల్ పోలియో బృందాన్ని తనిఖీ చేసి కోళ్లఫారాలు, ఇటుక బట్టీలు, సంచార జాతుల వారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది పవన్, రమణలను అభినందించారు. మండలంలో ఇప్పటివరకూ 99.9 శాతం మందికి చుక్కల మందు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎంపీహెచ్ఈఓ డీఎస్ మూర్తి, పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



పాస్టర్స్ ఫెలోషిప్ తుని పట్టణ, మండల నూతన కార్యవర్గ సభ్యులు

తుని రూరల్: పాస్టర్స్ ఫెలోషిప్ తుని పట్టణ, మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని కుమ్మరిలోవ బెతెస్థ ప్రార్థన మందిరంలో సోమవారం సంఘ గౌరవాధ్యక్షులు పాస్టర్ సీహెచ్ లిమ్మా, పాస్టర్ కె.ఫిలిప్ అధ్యక్షతన సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా పాస్టర్ కె.జాషువ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా జి.ఆనంద్‌కుమార్, కార్యదర్శిగా జి.వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా కె.జాషువ ముల్లర్, కోశాధికారిగా ఎం.సుదర్శన్, సహాయ కోశాధికారిగా జాన్ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాస్టర్లు కేజే జాషువ, కె.నతన, కె.స్టివెన్‌రాజు, టి.సాల్మన్, ఎస్.రాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు పూలమాలలతో అభినందించారు.

ఏలేశ్వరంలో హిందూధర్మ ప్రచారం




ఏలేశ్వరంలో రథంవద్ద స్వామివారికి పూజలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం అనంత లక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి రథంతో హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. పండితుడు పండూరి నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్థానిక చైతన్య నగర్‌లో స్వామిరథంతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో హిందూ ధర్మంపై చైతన్యం పెంపొందించేందుకు సత్యదేవుని రథంతో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హిందుమత ప్రచారకర్త అడపా వీరభద్రరావు, మహిళలు పాల్గొన్నారు.

జలము నిశ్చయంబు

- ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి
- వందకు పైగా ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం
- జగనన్న కాలనీల్లోనూ నీటి వసతులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎస్.అన్నవరంలో శివారు ప్రాంతాల కోసం ద్వారకా నగర్‌లో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్



ఎన్.చామవరంలో ఓహెచ్‌ఆర్, తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా (ఫైల్)

తుని రూరల్: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ముందు తర్వాత అన్నట్టుంది పరిస్థితి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇప్పటివరకూ తుని నియోజకవర్గంలో ఎన్నో గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందలేదు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, కుళాయిల ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు చేరుతోంది. పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో వేసవిలో సైతం తాగునీటి కష్టాలు కనుమరుగయ్యాయి. ఏటా వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామ స్థాయి నుంచి యాక్షన్ ప్లాన్ అమలయ్యేది. రెండేళ్లుగా వేసవిలో తాగునీటి ప్రణాళికలు రూపొందించే అవసరం లేకుండా పోయింది. కొత్తగా ఏర్పాటవుతున్న జగనన్న కాలనీల్లో సైతం నీటి వసతులను కల్పిస్తున్నారు. ఇందుకు అవసరమైన నిధులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రభుత్వం నుంచి తీసుకువచ్చారు.

రూ.75.70 కోట్లతో తాగునీటి వసతులు

జల్ జీవన్ మిషన్ నిధులు రూ.59.20 కోట్లతో 107 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. అందులో 65 ట్యాంకుల నుంచి తాగునీటి సరఫరా చేస్తున్నారు. 350 మీటర్ల పొడవు ప్రధాన పైపులైన్లను విస్తరించారు. 15 వేలు వరకు ఇంటింటా కుళాయిలు ఉచితంగా ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీల్లో రూ.16.48 కోట్లతో ఓవర్ హెచ్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయిల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గతంలో అవస్థలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో ఎన్నో గ్రామాల్లో ప్రజలు తాగునీటి అవస్థలు ఎదుర్కొన్నారు. 2019కి ముందు పలు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు లేవు. వల్లూరు, చేపూరు, బొద్దవరం, లోవకొత్తూరు, టి.వెంకటాపురం, జిల్లేడుపాడు, ఎస్.అన్నవరం శివారు ప్రాంతాల ప్రజలకు వేసవిలోనే కాకుండా సంవత్సరం పొడవునా తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యేవి. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో ఇప్పుడు వల్లూరులో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇప్పటికే ఒక ట్యాంకు నుంచి తాగునీరు సరఫరా చేస్తుండగా రెండో ట్యాంకు నుంచి నీటి సరఫరా చేసేందుకు బోరుబావులు తవ్వించి, పైపులైన్ల పనులు చేస్తున్నారు. ఎస్.అన్నవరంలో శివారు ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు మూడు ఓహెచ్‌ఆర్‌లు నిర్మించారు. లోవకొత్తూరుకు తొలిసారిగా ఓహెచ్‌ఆర్ నిర్మించి ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేస్తున్నారు. అలాగే ఒక్కొక్క ఓహెచ్‌ఆర్ ఉన్న గ్రామాల్లో అవసరాన్ని బట్టి అదనపు ట్యాంకులు నిర్మించి తాగునీటి ఎద్దడి లేకుండా రక్షితనీరు సరఫరా చేస్తున్నారు.



వల్లూరులో నిర్మించిన వాటర్ ట్యాంకులు

తాగునీటి కష్టాలు తీరాయి



మా గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాయి. 2019 ఎన్నికల్లో దాడిశెట్టి రాజా ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో ఒక వాటర్ ట్యాంకు నిర్మించి తాగునీటి సరఫరా చేస్తున్నారు. వందశాతం నీటి అవసరాలు తీర్చేందుకు రెండో వాటర్ ట్యాంకు నిర్మించారు. బోరుబావులు తవ్వించి, పైపులైన్ల పనులు జరుగుతున్నాయి. ఒక్క వాటర్ ట్యాంకు లేని మా గ్రామంలో ఇప్పుడు రెండు వాటర్ ట్యాంకులు నిర్మించుకున్నాం. మరో 20 ఏళ్లు తాగునీటి ఎద్దడి ఉండదు.

– కుర్ర విజయలక్ష్మి, సర్పంచ్, వల్లూరు

వేసవిలో యాక్షన్ ప్లాన్ అవసరం లేదు



మరో రెండు దశాబ్దాల పాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు జల్ జీవన్ మిషన్, ప్రభుత్వం నిధులతో వందకుపైగా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాం. వీటిలో 60 శాతం ట్యాంకులను ప్రారంభించగా మిగిలిన ట్యాంకుల పనులు పూర్తికావస్తున్నాయి. ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. దీంతో వేసవిలో తాగునీటి ఎద్దడి, యాక్షన్ ప్లాన్ అవసరం ఉండదు. తొండంగి మండలంలో స్లో శాండ్ ఫిల్టర్ల స్థానంలో రూ.6 కోట్లతో మెరుగైన రాపిడ్ శాండ్ ఫిల్టర్ పాయింట్ ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎ.శివాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, తుని

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



కొత్తపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, రైతాంగానికి, ఫ్యాక్టరీలకు ఉపయోగపడేలా ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మించామన్నారు. నూతన సబ్‌స్టేషన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలు తీర్చడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. తనకు ప్రజాసేవే ముఖ్యమని, పదవులు, రాజకీయాలు తరువాతేనని చెప్పారు. కార్యక్రమంలో జనపరెడ్డి బాబు, దాసరి రమేష్, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, రౌతు జోగేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), తుమ్మల చిన్నబ్బు తదితరులు పాల్గొన్నారు.

తణుకు వెళ్లి పింఛన్ అందజేత



తణుకులో సూర్యావతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వల్లీరాణి

ఏలేశ్వరం: ఏలేశ్వరం పట్టణానికి చెందిన వృద్ధురాలు శిరపు సూర్యావతి అనారోగ్యంతో తణుకులోని తన రెండో కుమారుడు రామలింగేశ్వరావు వద్ద ఉంటోంది. ఆమె వృద్ధాప్య పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు కౌన్సిలర్ సామంతుల హైమావతి సూచన మేరకు గ్రామ వలంటీర్ వల్లీ రాణి తణుకు వెళ్లి వృద్ధురాలు సూర్యావతికి పింఛన్ అందజేశారు. మానవత్వం చాటిన వలంటీర్ వల్లీరాణిని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

రిఫరల్ ఆసుపత్రిలో నేత్ర, ఎముకల విభాగాలు ప్రారంభం



రిఫరల్ హాస్పటల్‌లో నేత్ర, ఎముకల విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

శంఖవరం: మండలంలోని సీతంపేటలో ఇండియా సెల్ఫ్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిఫరల్ ఆసుపత్రిలో నేత్ర, ఎముకలు విభాగాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు బ్యూనో మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రిలో ఎముకలు, నేత్ర విభాగాలను ప్రారంభించామన్నారు. ఈ విభాగాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు కో ఆర్డినేటర్ ఆర్ ప్రవీణ్‌దాస్, మేనేజర్ కేశవరావు, ప్రసాద్, తాతారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాటల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కిర్లంపూడి: కాకినాడ జేఎన్‌టీయూకేలో ఇటీవల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ అవార్డ్స్–2024 పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన పాటల పోటీల్లో మండలంలోని సోమవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని డి.దేవి ప్రతిభ చూపి జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్టు జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ ఎస్.కన్నబాబు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని దేవిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 47 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ, ప్రగతి ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సోమవారం జరిగిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ఇంగ్లిషు పరీక్షకు 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటిండెంట్‌లు కల్యాణ్‌కుమార్, కె.ఉషామాధురి తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 1112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,065 మంది హాజరయ్యారు. కాగా 47 మంది గైర్హాజరైనట్టు వివరించారు.

వరుపుల రాజా వర్ధంతి

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా వర్ధంతిని నిర్వహించారు. మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ జోన్–2 ఇన్‌చార్జ్, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా భార్య సత్యప్రభ, కుమారుడు బాబీ, కుమార్తె సత్య చేతుల మీదుగా వరుపుల రాజా విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. వరుపుల రాజా మృతికి పార్టీకి తీరని లోటు అని అతిథులు పేర్కొన్నారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పేదల సొంతింటి కల సాకారం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కిర్లంపూడిలో పేదలకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ



కిర్లంపూడిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు అందజేసిన తోట నరసింహం

కిర్లంపూడి: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాకారం చేశారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని సత్యదేవా కల్యాణ మండపం ఆవరణలో సోమవారం తహసీల్దార్ బి.ఆశయ్య అధ్యక్షతన పేదలకు సోమవారం జగనన్న ఎన్‌పీవీ ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సొంత ఆస్తిని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కిర్లంపూడి మండలంలో సుమారు 3894 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. ఆ స్థలాల్లో ఇప్పటికే పలువురు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. అనంతరం కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, ముక్కొల్లు, గోనేడ, సింహాద్రిపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, దాడి చినబుజ్జి, ఓలేటి రాజు, పలెకల గంగరాజు, జోకా శ్రీను, దోమాల గంగాధర్, డీటీ సాయికిరణ్, ఆర్ఐ సత్యదేవాప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లపై సంపూర్ణ హక్కులు

గండేపల్లి: నవరత్రాలు–అర్హులందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు ఇళ్లపై సంపూర్ణ హక్కులను ప్రభుత్వం కల్పించిందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలను పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి రుణాలు ఇచ్చి ఆ ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సర్పంచులు బొబ్బర శివ, ములంపాక సురేష్, పార్టీ నేతలు పరిమి వెంకటేశ్వరరావు, గొల్లేపల్లి రవి, నిమ్మలపూడి శ్రీహరి, పాలచర్ల వెంకన్న చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: అనంతరం జగ్గంపేటలో లబ్ధిదారులకు తోట నరసింహం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పార్టీ నేత అత్తులూరి సాయిబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



గోకవరంలో ఎంపీడీఓ వసంత దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

గోకవరం: ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ కె.వసంత ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ ఆధ్వర్యంలో ఎంపీడీఓ దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఎటువంటి రిమార్కు లేకుండా పారదర్శకంగా పనిచేసిన ఎంపీడీవో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సొసైటీ చైర్మన్ దాసరి చిన్నబాబు, నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, బత్తుల నానాజీ, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ప్రత్తిపాడు: స్థానిక వైఎస్సార్ కాంతిపథం కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయల స్టాల్‌ను రైతులు ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను ఏపీఎం వై.వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగును ప్రోత్సహించేందుకు ప్రతి సోమవారం ప్రకృతి ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్లు తదితర పంటలను ప్రదర్శిస్తున్నారన్నారు. అవసరమైన వారు వాటిని కొనుగోలు చేయవచ్చన్నారు. మండలంలోని పెద్దిపాలెం, గోకవరం, బవురువాక, ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి, శరభవరం గ్రామాల్లో రైతులు, మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలను పండిస్తున్నారన్నారు. వారంవారం స్పందన రోజున ప్రకృతి సాగు ద్వారా పండించిన కూరగాయలను ఈ స్టాల్ వద్ద రైతులు విక్రయిస్తారన్నారు. రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు మాస్టర్ ట్రైనర్లు మూరా చినబాబు, ఎం.రామరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు, వైఎస్సార్ కాంతిపథం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కూరగాయల స్టాల్

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- రామేశంపేటలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామేశంపేటలో ఆయన అనుచరుడు కుంచే చినబాబు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న ఎన్నికల సంగ్రామంలో ప్రజలు పేదల పక్షపాతి అయిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల వారికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మన బడి నాడు–నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తొలుత పార్టీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, యువ నాయకుడు తోట రాంజీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు తోట నరసింహాన్ని పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మధు, పార్టీ నేతలు కుంచే తాతాజీ, పలికల గంగరాజు, కుంచే పెదబాబు, గోరింట అబ్బులు, నల్లల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో తోట నరసింహాన్ని సత్కరిస్తున్న పార్టీ నేతలు

భారతీయ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవం

ఏలేశ్వరం: మండలంలోని చిన్నింపేటలో భారతీయ కిసాన్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ్ జిల్లా కమిటీ కార్యదర్శి రాసంశెట్టి రాజా ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. రైతులు లాభదాయకంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కందా వీరాస్వామి, రామకుర్తి రాజబాబు, తోలేటి గంగాధర్, చింతాకుల రామకృష్ణ పాల్గొన్నారు.



చిన్నింపేటలో జెండాలతో ఐక్యత చాటుతున్న కిసాన్ సంఘ్ సభ్యులు

సత్యదేవుని దర్శించిన నవశక్తి క్షేత్ర పీఠాధిపతి

అన్నవరం: గుంటూరు జిల్లా పెదకాకానిలోని నవశక్తి క్షేత్రం పీఠాధిపతి భవాని శంకరానందస్వామి సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం భవాని శంకరానందస్వామి కి వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలను బహూకరించారు.



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న భవాని శంకరానంద స్వామి

భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సామర్లకోట: భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాక్ సిరామిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘోష్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాలను సోమవారం స్థానిక రాక్ సిరామిక్స్‌లో ప్రారంభించారు. తొలుత భద్రత పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారాల్లో పని చేసే సమయంలో ఎల్లప్పుడూ భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. హెడ్ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్ టి.నీరజ్‌కుమార్, జనరల్ మేనేజర్ రాజిందర్ సింగ్‌మాన్, టైల్స్ హెడ్ వినోద్‌పైక వాసుదేవ, శానిటరీ వేర్ హెడ్ చెల్ల దుర్గైలు మాట్లాడుతూ కార్మికులు మోటారు సైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఫ్యాక్టరీలో వారం రోజుల పాటు భద్రతకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. పర్చేజ్ హెడ్ వెంకటేశ్వరరావు, ఈహెచ్ఎస్ మేనేజర్ పి.బాలాజీ పాల్గొన్నారు.



సామర్లకోటలో భద్రతా వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న నీరజ్‌కుమార్

సారాతో వ్యక్తి అరెస్ట్

కిర్లంపూడి: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై షేక్ జబీర్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని గోనేడలో సారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా సారా తరలిస్తున్న నక్కా దొంగయ్య(దొరబాబు)ను అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జబీర్ తెలిపారు.

పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

సామర్లకోట: వేతన ఒప్పందం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా ఏబీ బేవరేజ్ కార్పొరేషన్ యాజమాన్యం స్పందించడం లేదని స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా డిపోలో కార్మికులుగా పని చేస్తున్న వారికి పీఎఫ్, ఇఎస్ఐ అమలు కోరుతూ మంగళవారం చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు.